క్లుప్తంగా

చట్టాలపై పరిజ్ఞానం పెంచుకోవాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా జడ్జి యామిని

రాపూరు: మహిళలు వారి హక్కులు, చట్టాలపై పరిజ్ఞానం పెంచుకోవాలని నెల్లూరు జిల్లా జడ్జి యామిని సూచించారు. రాపూరు బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల కోసం ప్రత్యేకంగా న్యాయ విజ్ఞాన సదస్సులను జిల్లాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చట్టాలపై మహిళలు అవగాహన పెంపొందించుకుని రక్షణ పొందాలన్నారు. గృహ హింస, వరకట్నం తదితర చట్టాలపై వివరించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వాణి మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం అమలులో ఉన్న చట్టాలను, ఉచిత న్యాయ సాయం పొందే విధానాలు, లోక్ అదాలత్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి సివిల్ కోర్టు జడ్జి అనూష, లోక్ అదాలత్ సభ్యులు రాజేష్, న్యాయవాదులు సునీత, అనుపమ, ఎంపీడీఓ భవాని, ఆర్ఐ రవి, ఎస్ఐ వెంకటరాజేష్, ఏపీఎం రాధ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



పెళ్లకూరు చాగణం ట్రస్ట్‌లో ఉచిత కంటి వైద్యశిబిరం

పెళ్లకూరు: మండల కేంద్రమైన పెళ్లకూరులోని చాగణం లలితమ్మ, భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ప్రాంగణంలో ఆదివారం తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద నేత్రాలయ, చాగణం ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పెళ్లకూరు పరిసర ప్రాంతాల నుండి విచ్చేసిన 120 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో 45మంది వ్యాధిగ్రస్తులకు కంటి అద్దాలు, 15మందికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేయించేలా ట్రస్ట్ ప్రతినిధులు తగిన చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో అరవింద నేత్రాలయ వైద్యులు, ట్రస్ట్ అధ్యక్షురాలు చాగణం వరలక్ష్మి, సీఈఓ సీతారామయ్య, ఏఓ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్బారావుకు ఎంపీపీ పరామర్శ



సుబ్బారావును పరామర్శిస్తున్న ఎంపీపీ అరుణారెడ్డి

ఓజిలి: ఓజిలి గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ సీనియర్ నేత ముమ్మడి సుబ్బారావు యాదవ్‌ను ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి ఆదివారం పరామర్శించారు. గత కొద్దిరోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో పరామర్శించి ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమె వెంట నాగేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సదస్సును విజయవంతం చేయండి



కరపత్రాల విడుదల

సైదాపురం: ఫిబ్రవరి 5న విజయవాడలో నిర్వహించే ప్రగతి శీల మహిళ సంఘం రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ప్రగతి శీల మహిళా సంఘం నాయకురాలు మమత కోరారు. మండల కేంద్రమైన సైదాపురంలో ఆదివారం ప్రగతి శీల కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రగతి శీల మహిళ సంఘం దేశంలో, రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న లైగింక దాడులు, అత్యాచారాలు, హత్యలకు వ్యతిరేకంగా గత ఐదు దశబ్దాలుగా పోరాడుతోందన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాం, తల్లికి వందనం పేరుతో తల్లులకు ఇచ్చే రూ.15000 జమ చేస్తామనే హామీలు నెరవేర్చలేదన్నారు. పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేసింది. కార్యక్రమంలో నేతలు ఇంద్రమ్మ, పెంచలమ్మ, శ్రావణి, సునీత, సులోచనమ్మ, రత్నమ్మ తదితరులు ఉన్నారు.

కలువాయిలో జెండా వందనం సమర్పిస్తున్న ఎస్ఐ సుమన్, బాలాయపల్లిలో జెండాను ఎగువవేస్తున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, షార్ స్కూల్‌లో గణతంత్ర వేడుకలు, ఉత్తమ అవార్డులు అందుకున్న వెంకటగిరి అధికారులు, చిట్టమూరులో జెండా ఆవిష్కరణ







ఘనంగా గణతంత్ర వేడుకలు

సైదాపురం: వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని అన్నీ గ్రామాల్లో ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సైదాపురం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పెంచలమ్మ, జెడ్పీటీసీ పోలయ్య, ఎంపీడీఓ శివకుమార్ మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రమాదేవి పోలీసు కవాతుతో మువ్వన్నెల జెండాను ఎగరవేశారు. పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ క్రాంతికుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ప్రశాంతి జెండాను ఎగరవేశారు. సైదాపురం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ శారద జెండాను ఆవిష్కరించారు.

రాపూరులో..

రాపూరు: గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మీనరసింహం, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ భవాని, సీఐ కార్యాలయంలో సీఐ సత్యనారాయణ, కండలేరు జలాశయం డీఈ బాబయ్య, రాపూరు ఆర్టీసీ డిపోలో మేనేజర్ అనిల్ కుమార్, జూనియర్ కళాశాల్లో ప్రిన్సిపల్ నాయక్, వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యులు ప్రమీల రాజకుమారి, పెంచలకోన దేవస్థాన కార్యాలయంలో ప్రధానార్చకులు రామయ్యస్వామి, గుడ్ షెఫర్డ్ స్కూల్‌లో ప్రిన్సిపల్ రాజరత్నం, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో పలువురు అధికారులు జెండాను ఎగురవేసి గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు.

డక్కిలిలో..

మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రభుత్వ పాఠశాలలు సచివాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలోఎస్ఐ శివశంకర్, ఎంఈఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఉత్తమ తహసీల్దార్‌గా ఎం శ్రీనివాసులు, ఆర్ఐ ప్రియాంక, సర్వేయర్ సురేష్, వీఆర్ఓ నరేష్‌లకు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా చేతుల మీదుగా ఉత్తమ అవార్డులను అందుకున్నారు.




గూడూరు రూరల్ :కోర్టు ఆవరణలో జెండా ఎగురవేస్తున్న న్యాయమూర్తి, రాపూరు మండలం కండలేరు గురుకుల పాఠశాల్లో విద్యార్థినులు

బాలాయపల్లిలో...

ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటున్నారని ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన బాలాయపల్లిలో ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అధ్యక్షతన ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులు, పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ గోపి, ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి ప్రశాంతి తదితరులున్నారు.

కలువాయిలో..

కలువాయి: కలువాయిలో ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయం ముందు తహసీల్దారు శ్యాం సుందర్‌రాజు, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సుమన్, కలువాయి సచివాలయంలో ఈఓ సుధాకర్, ఇతర కార్యాలయాల్లో ఆయా శాఖల అధికారులు జెండా ఎగురువేసి వందనం సమర్పించారు. కలువాయి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ రామకుమారి ఉత్తమ సేవలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఉత్తమ క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్‌గా కలువాయి విద్యాశాఖ కార్యాలయంలో ఎంఆర్‌టీగా పని చేస్తున్న తుమ్మల నాగేశ్వరరావు నెల్లూరు జిల్లా విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

వెంకటగిరి రూరల్‌లో..

వెంకటగిరి రూరల్: ఎందరో మహనీయుల త్యాగఫలమే గణతంత్ర దినోత్సవమని 9వ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ అరుణ్‌బోష్ సూచించారు. మండలంలోని వల్లివేడు సమీపంలోని బెటాలియన్‌లో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఆనంద్ ఖన్నా, డీఎస్పీ విజయ్‌ఆనంద్, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీపీ తంబిరెడ్డి తనూజరెడ్డి ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కోటేశ్వరరావు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు ఎస్.బాలయ్య, ఉమామహేశ్వరి, కౌన్సిలర్లు, కమిషనర్ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని 21వ వార్డు వెలమపాళెంలో ఉన్న మహాత్మగాంధీ విగ్రహం వద్ద ఆ వార్డు కౌన్సిలర్ జి.ఢిల్లీబాబు ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. నేతలు గౌస్‌బాషా, హనుమంతురావు, తాజుద్దీన్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. బంగారుపేట ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం నరేష్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య ఆ వార్డులోని పుల్లయ్యబడి, ధర్మాపురం ఎంపీపీ పాఠశాలలో, 14వ వార్డు సచివాలయంలో ఏర్పాటు చేసిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని సందేశం వివరించారు.

తడలో..

తడ: భారత గణతంత్ర వేడుకలను ఆదివారం తడలో ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ ఎంపీపీ కొళవి రఘురెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ శరత్, ఎస్ఐ కొండపనాయుడు వారి, వారి కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఎగుర వేసి వందన సమర్పణ చేశారు. ఎంఈఓ కార్యాలయం వద్ద ఎంఈఓలు మల్లికార్జునరావు, సరస్వతి, సిబ్బంది బాలాజీ, షణ్ముఖితోపాటు క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్లు గోపినాథ్, మునుస్వామి, బాలాజీ, మునీష్‌లను గంధపు మాలలతో సత్కరించారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా గూడూరు నియోజకవర్గంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు రూరల్..

డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ గీతాకుమారి, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, కోర్టు ఆవరణలో న్యాయమూర్తి షమ్మీ పర్వీన్ సుల్తానాబేగం జాతీయజెండా ఎగురవేశారు.



చిల్లకూరు: జెండా వందనం చేస్తున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా



వాకాడు: ఎంపీడీఓ కార్యాలయం వద్ద జెండా ఎగురవేసిన అన్నపూర్ణరావు







నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ, పెళ్లకూరులో రెవెన్యూ కార్యాలయం వద్ద.., ఓజిలిలోజాతీయ జెండాకు వందన సమర్పణ, దొరవారిసత్రంలో..., తడలో గాంధీజీకి నివాళి






వాకాడు :కల్లూరులో రిపబ్లిక్‌డే వేడుకల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, సింహపురి పవర్‌ప్లాంట్‌లో జెండా వందనం, కోట: జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎంపీడీఓ వేణు, ఎంపీపీ అంజమ్మ, జెండా ఆవిష్కరణ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీడీఓ

త్వరలోనే గగన్‌యాన్

- షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ వెల్లడి

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) గగన్‌యాన్-1 ప్రయోగానికి సిద్ధమవుతున్నామని, ఇస్రో ఆవిర్భావం తరువాత షార్ నుంచి వందో ప్రయోగంగా జీఎస్ఎల్‌వీ ఎఫ్-15 ప్రయోగాన్ని ఈ నెల 29న నిర్వహించనున్నామని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ పేర్కొన్నారు. ఆదివారం షార్‌లోని స్పేస్ సెంట్రల్ స్కూల్ మైదానంలోకి 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షార్ డైరెక్టర్ రాజరాజన్ మువ్వన్నెల జెండాను ఎగురవేసి వందనం సమర్పించారు. అనంతరం కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాలు(సీఐఎస్ఎఫ్) సైనిక వందనాన్ని సమర్పించాయి. స్పేస్ సెంట్రల్ స్కూల్ ఉపాధ్యాయులను, అగ్రశ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు. ఈ ఏడాదిని గగన్‌యాన్ ప్రాజెక్టు సంవత్సరంగా ప్రకటించుకుని ఆ దిశగా ప్రయోగాలు చేసిన అనంతరం 2040 నాటికి మానవ సహిత ప్రయోగాన్ని నిర్వహించనున్నామని అన్నారు. ఈ ఏడాది మార్చి నెలాఖరులోపు గగన్‌యాన్-1 ప్రయోగంలో భాగంగా క్రూమాడ్యూల్‌ను ప్రయోగాత్మకంగా పరిశీలించనున్నామని తెలిపారు. షార్ నుంచి గత ఏడాది ఆరు ప్రయోగాలు చేశామన్నారు. ఇందులో నవంబర్ 19న అమెరికాలోని ఫాల్కన్ రాకెట్ నుంచి జీశాట్-20 అనే ఉపగ్రహాన్ని పంపించామని తెలిపారు. షార్ కేంద్రం నుంచి ఐదు ప్రయోగాలు చేశామన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ చూపిన షార్ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, గ్రూప్ డిప్యూటీ డైరెక్టర్ గోపీకృష్ణ పాల్గొన్నారు.



షార్ కేంద్రంలో సైనిక వందనాన్ని స్వీకరిస్తున్న షార్ డైరెక్టర్ రాజరాజన్

ఉత్తమ సేవలకు అవార్డులు

రాపూరు: మండలంలోని కండలేరు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ భారతి నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా ఆదివారం అవార్డు అందుకున్నారు. నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ సేవలు అందించినందుకు ఆమెకు అవార్డు అందించారు.

హోంగార్డుకు అవార్డు

రాపూరు మండలం కండలేరు జలాశయం పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న శివ ఉత్తమ సేవలు అందించినందుకు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. శివ ఉత్తమ అవార్డును శుక్రవారం నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగి 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసలు

బాలాయపల్లి(సైదాపురం): విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు బాలాయపల్లి ఎంపీడీఓ డీజే వినీల్‌కు ప్రశంస పురస్కారం లభించింది. తిరుపతిలోని కలెక్టరేట్ కార్యాలయం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదుగా డీజే వినీల్ ప్రసంశ పత్రాన్ని అందుకున్నారు.

సైదాపురంలో..

సైదాపురం: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన సైదాపురం ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్, ఎస్ఐ క్రాంతికుమార్, రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ జనార్దన్‌లకు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు.



బాలాయపల్లి(సైదాపురం): ప్రశంస పత్రం అందుకుంటున్న ఎంపీడీఓ డీజే వినీల్





రాపూరు: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా అవార్డు అదుకుంటున్న అధికారులు

ఆస్తులు అన్యాక్రాంతం

- ఇష్టారాజ్యంగా దర్గా దుకాణాల అద్దెలు వసూలు
- 9 ఏళ్లుగా నిలిచిపోయిన ఉరుసు
- పట్టించుకోని వక్ఫ్‌బోర్డు అధికారులు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణ నడిబొడ్డున ఉన్న హజరత్ అమీర్‌షావలీ దర్గాకు సంబంధించిన రూ.కోట్ల విలువైన ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయి. దర్గాకు సంబంధించిన గదుల నుంచి వచ్చే అద్దెను కొందరు ప్రైవేట్ వ్యక్తులు వసూలు చేసుకుంటున్నారు. ఈ విషయం తెలిసినా వక్ఫ్‌బోర్డు అధికారులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై హజరత్ అమీర్‌షావలీ భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాయుడుపేట పట్టణంలోని దర్గా వీధిలో మత సామరస్యానికి ప్రతీకగా హజరత్ అమీర్‌షావలీ దర్గా ఉంది. ఇక్కడ ప్రతి ఏటా మార్చిలో గంధోత్సవం (ఉరుసు) నిర్వహిస్తారు. దీనికి పట్టణంలోని దర్గా సమీపంలోనే 29 వరకు గదులతో కూడిన దుకాణాల సముదాయం ఉంది. వీటి నుంచి ప్రతినెలా సుమారు రూ.4.35 లక్షల ఆదాయం వస్తుంది. కొన్నేళ్లుగా గంధోత్సవాలను దోర్నాదుల చెంచుక్రిష్ణయ్య ఆధ్వర్యంలోని కమిటీ నిర్వహిస్తోంది. దుకాణ సముదాయం నుంచి వచ్చే అద్దెలను సైతం కమిటీ సభ్యులే వసూలు చేస్తున్నారు.



నాయుడుపేట పట్టణంలోని హజరత్ అమీర్ షావలీ దర్గా



హజరత్ అమీర్‌షావలీ దర్గాకు సంబంధించిన దుకాణాల సముదాయం

ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నా..

2016లో అమీర్‌షావలీ దర్గాకు సంబంధించిన ఆస్తులను వక్ఫ్‌బోర్డుకు సంబంధించినవిగా ప్రభుత్వం గుర్తించింది. వాటిని ఆ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రెవెనూ రికార్డుల ప్రకారం సర్వే నంబరు 322-2లో 69 సెంట్ల స్థలంలో దర్గాకు చెందిన 29 దుకాణాలు, అమీర్‌షావలీ దర్గా, మసీదుతో పాటు కొన్ని భవనాలు ఉన్నట్లుగా రికార్డుల్లో పొందుపరిచారు. 2016 ఫిబ్రవరిలో అమీర్‌షావలీ దర్గాతో పాటు అమీర్‌షావలీ మసీదు మేనేజ్ మెంట్ కమిటీని వక్ఫ్‌బోర్డు అధికారులు ఏర్పాటు చేశారు.

పాత, కొత్త కమటీ మధ్య ఆధిపత్య పోరు

2016లో వక్ఫ్‌బోర్డు కమిటీ గంధోత్సవాలను నిర్వహించేందుకు సన్నద్ధమవడంతో పాత కమిటీ వారు అభ్యంతరం చెప్పారు. దీంతో వివాదం మొదలైంది. అధికారులు జోక్యం చేసుకోవడంతో వక్ఫ్‌బోర్డు ఏర్పాటు చేసిన కమిటీతో పాటు పాత కమిటీ వారు కలిసి వేడుకలను నిర్వహించారు. దర్గా అధిపత్యంపై ఇరువర్గాల వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ క్రమంలో 2017 నుంచి గంధోత్సవాలు ఆగిపోయాయి. వక్ఫ్‌బోర్డు మేనేజ్‌మెంట్ కమిటీ, దర్గా పాత కమిటీ మధ్య వివాదం తారస్థాయికి చేరింది. రెవెన్యూ, పోలీసు అధికారుల సమక్షంతో పలుమార్లు చర్చలు జరిగినా ఫలితం లేదు.

లెక్కాపక్కా లేని అద్దెలు

దర్గాకు చెందిన దుకాణ సముదాయంలో ఉన్న గదుల్లో కొన్నింటిని పాత కమిటీ సభ్యులు వాడుకుంటున్నారు. మరికొన్నింటిని ఇతరులకు అద్దెకు ఇచ్చారు. 2016లో ఏర్పాటైన వక్ఫ్ బోర్డుకు అద్దెలు ఇవ్వడం లేదు. నాటి నుంచి ఆదాయం ఏమవుతోంది తెలియడం లేదు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి దర్గా వివాదాలను పరిష్కరించి కోట్ల విలువైన ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై తిరుపతి జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ షేక్ గౌస్ మొహిద్దీన్, తహసీల్దార్ మాగర్ల రాజేంద్ర వివరణ ఇస్తూ అమీర్ షావలీ దర్గా ఆస్తులు, గంధోత్సవం నిర్వహణ విషయాలపై కోర్టులో విచారణ జరుగుతోందన్నారు.

ముస్లిం నేత మృతికి సంతాపం



షేక్ హనీఫ్

నాయుడుపేట టౌన్: ముస్లిం మైనారిటీ నాయకుడు, చికెన్ దుకాణాల యూనియన్ అధ్యక్షుడు షేక్ హనీఫ్(42) ఆకస్మిక మృతిపై పలువురు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం ఒక్కసారిగా హనీఫ్ అస్వస్థతకు గురికావడంతో వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. వైఎస్ఆర్ సీపీ ముస్లిం మైనారిటీ పట్టణ అధ్యక్షుడు షేక్ రహంతుల్లా, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, ముతవల్లీలు సంతాపం వ్యక్తం చేశారు.